క్లుప్తంగా

దాడి కేసులో ఇద్దరికి బెయిల్

పెనుగంచిప్రోలు: గత నెల 18న పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ చిన్నతిరునాళ్ల సందర్భంగా ఇరు వర్గాల మధ్య జరిగిన దాడి ఘటనకు సంబంధించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఇద్దరికి గురువారం బెయిల్ మంజూరైంది. ఈఘటనకు సంబంధించి 16మందిలో 10మందికి ఇప్పటికే బెయిల్ మంజూరైంది. ఈ కేసులో తాజాగా గునిశెట్టి మణికంఠ, దేరంగుల యాదగిరికి నందిగామ కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాగునీటి బోరు ప్రారంభం



జయంతిపురం(జగ్గయ్యపేట): వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ఆదేశించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలం ముగిసే వరకు గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఇమాం సాహెబ్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

20న ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

నందిగామటౌన్: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈ నెల 20న మహిళలకు ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టుల శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫార్మా ఫౌండేషన్ ట్రస్ట్ చైర్మన్ వైఎస్ బాబు గురువారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు జన్మదినం సందర్భంగా మణిపాల్ హాస్పిటల్ సహకారంతో 20న మధ్యాహ్నం రెండు గంటల నుంచి స్క్రీనింగ్, పలు రకాల పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నందిగామ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు



నందిగామరూరల్: మండలంలోని ఐతవరంలో పారిశుద్ధ్యం మెరుగుదలకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కార్యదర్శి జీవనజ్యోతి తెలిపారు. గ్రామంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్ల వెంబడి, ఖాళీ ప్రదేశాలలో పేరుకుపోయిన చెత్తా చెదారాలను తొలగించడంతోపాటు కాల్వల్లో పూడిక తీత పనులు చేశారు. అదేవిధంగా అంబారుపేట, కేతవీరునిపాడు, లింగాలపాడు, అడవిరావులపాడు, చెరువుకొమ్ముపాలెం తదితర గ్రామాల్లో నిర్వహించిన పారిశుద్ధ్య పనులను ఆయా గ్రామాల కార్యదర్శులు పర్యవేక్షించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వీరులపాడు: అగ్నిప్రమాదాల నియంత్రణపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక శాఖాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని పొన్నవరం గ్రామ సమీపంలోని ఏకత్వ పాఠశాలలో అగ్ని, విద్యుత్, నీటి ప్రమాదాలు సంభవించిన సమమయంలో స్పందించాల్సిన విధానాలపై గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం సంభవిస్తే భయపడకుండా ముందస్తుగా అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించడంతోపాటు ఆ ప్రాంతం నుంచి సురక్షితంగా బయటకు వెళ్లేందుకు యత్నించాలన్నారు. ముఖ్యంగా సురక్షిత దేశానికి ఐక్యం కావాలని కోరుతూ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల పాఠశాల ప్రతిధులు అమరనేని మనోజ్, సింధూర, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

భూసర్వేపై గ్రామసభ నిర్వహణ



గండ్రాయి(జగ్గయ్యపేట): గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలను ప్రజలు తమదృష్టికి తీసుకురావాలని ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్ సూచించారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద భూ రీసర్వే గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం వివాదాలు, రీసర్వే సక్రమంగా నిర్వహించకుంటే సదస్సులో అర్జీ రూపంలో దరఖాస్తు చేసుకుంటే తిరిగి మరోసారి సర్వే చేస్తామని వివరించారు. కార్యక్రమంలో డీటీ రాధిక, మండల సర్వేయర్ అనూష్‌బాబు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల వద్ద సీహెచ్‌ఓల ఆందోళన





గొల్లమూడి, లింగాలపాడు పీహెచ్‌సీల వద్ద ఆందోళన చేస్తున్న మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ కం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

వేతనాలు పెంచాలని డిమాండ్

నందిగామరూరల్: గ్రామీణ ప్రాంత ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న తమకు వెంటనే వేతనాలను 23శాతం పెంచాలని మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ కం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. రాష్ట్ర అసోసియేషన్ పిలుపు మేరకు నందిగామ మండలంలోని గొల్లమూడి, లింగాలపాడు పీహెచ్‌సీలు, చందర్లపాడు పీహెచ్‌సీ ఎదుట మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ కం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా వేతనాలు పెంచకపోవడంతో ఇబ్బందిపడుతున్నామని, వెంటనే వేతనాలు పెంచాలని కోరారు. ఇన్సెంటివ్‌లు ఇవ్వడం లేదన్నారు. ఏడాదిగా ఈపీఎఫ్ సదుపాయం లేదని, ఈ విషయంపై అడిగితే సమాధానం చెప్పేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరేళ్లుగా పనిచేస్తున్న తమను జీవో ప్రకారం రెగ్యులర్ చేసే అవకాశం ఉన్నందున, ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులరైజ్ చేయడం ద్వారా ఉద్యోగభద్రత కల్పించాలన్నారు. వేతనాన్ని 23శాతం పెంచడంతోపాటు ఈపీఎఫ్ కూడా పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎంసీఏలు నవీన్, అంజలి, కిషోర్, దుర్గాభవాని, నీలిమ, వర్షిణి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ముండ్లపాడులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ఉషారాణి



వత్సవాయిలో గర్భిణులకు సామూహిక సీమంతం చేస్తున్న సీడీపీఓ లక్ష్మిభార్గవి, హర్షిదాబేగం, సిబ్బంది



బోడవాడలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ యార్లగడ్డ ప్రభావతి

వత్సవాయి: గర్భవతులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి సూచించారు. పోషణ్ పక్వాడ్ వారోత్సవాల్లో భాగంగా వత్సవాయి జెడ్పీ పాఠశాలలో గర్భిణులు, బాలింతలకు గురువారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా లక్ష్మీభార్గవి మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత సమస్యను అధిగమించేందుకు తగిన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు తప్పకుండా ఎప్పటికప్పుడు వైద్యులను సంప్రదిస్తూ, వారి సలహాలను పాటించాలన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా సీతమ్మ, తహసీల్దార్ కె.ప్రభుకుమార్, వైద్యాధికారి హర్షిదాబేగం, సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, బీబీజాన్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బాలామృతంతో ఎన్నో ఉపయోగాలు..

పెనుగంచిప్రోలు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే బాలామృతంతో ఎన్నో రకాల పోషకాలున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉషారాణి పేర్కొన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ముండ్లపాడు, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, జయలక్ష్మి, రాజ్యలక్ష్మి,, నాగమణి, విమల, మంజుల, ధనలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: చిరుదాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని ఐసీడీఎస్ సెక్టార్ అధికారి యార్లగడ్డ ప్రభావతి పేర్కొన్నారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని బోడవాడ అంగనవాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత వంటి అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగనవాడీ కార్యకర్త బేతపూడి సుజాత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు పండ్లు పంపిణీ



రొట్టెలు, పండ్లు పంపిణీ చేస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, ఏలూరి శివాజీ, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం రాష్ట్ర మాజీమంత్రి దేవినేని రాజశేఖర్(నెహ్రూ) వర్ధంతిని నిర్వహించారు. దేవినేని రాజశేఖర్(నెహ్రూ) చిత్రపటానికి ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరి శివాజీ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవినేని సేవలను కొనియాడారు. రాజశేఖర్(నెహ్రూ) కుమారుడు అవినాష్ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ప్రజాసమస్యలపై పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులు, ఆస్పత్రిలో సదరం రీవెరిఫికేషన్ క్యాంపునకు హాజరైన దివ్యాంగులకు రొట్టెలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు ఏలూరి శివాజీ, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్, బద్దూనాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా కార్యదర్శులు వేముల మల్లేశ్వరరావు, నాగబాబు, నాయకులు నంబూరి రవి, చౌడవరపు జగదీష్, శ్రీనివాసగౌడ్, బాణావత్ రాజు, జవ్వాజి నరసింహారావు, షేక్ మున్నీహీరా, ధరావత్ శ్యామల, పింగళి నర్సింహారెడ్డి, దివ్వెల రామారావు, గంగోలు వినోద్, గోగుల వెంకయ్య, దారెల్లి మహేష్, దార్ల ప్రసన్నకుమార్, షేక్ ఇమ్రాన్, గూడపాటి శేషగిరిరావు, ఉప్పెల్లి పెంటయ్య, గొట్టిపాళ్ల సురేష్, షేక్ ఖాదర్‌బాబు, దొంగల రాంబాబు, గొర్రెపాటి బుల్లియ్య పాల్గొన్నారు.

రామ్‌కో ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్



జయంతిపురం(జగ్గయ్యపేట): రామ్‌కో సిమెంట్స్ కర్మాగార వ్యవస్థాపకుడు రామస్వామి రాజా 131వ జయంతి ఉత్సవాలలో భాగంగా జయంతిపురం గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంటును రామ్‌కో ప్రెసిడెంట్ ఆశిష్‌కుమార్ శ్రీవత్సవ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని 15 సిమెంట్ కర్మాగారాలకు చెందిన ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ మూర్తి, డీజీఎం ఫరూక్, సీనియర్ జనరల్ మేనేజర్ రామకృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరి ట్రస్ట్ సేవలు అభినందనీయం



ఆస్పత్రిలో అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

నందిగామటౌన్: తాళ్లూరి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అల్పాహారం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించి రోగులకు అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 40 రోజులుగా ట్రస్ట్ ఆధ్వర్యంలో రోగులకు అల్పాహారం పంపిణీ చేయడం అభినందనీయమని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలంటూ ట్రస్ట్ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ఆస్పత్రి సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

సర్వే నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎంపీడీవో నితిన్

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో చేపట్టనున్న బంగారు కుటుంబం సర్వేను సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు నిస్పక్షపాతంగా పూర్తిచేయాలని ఎంపీడీవో నితిన్ సూచించారు. తన కార్యాలయంలో గురువారం ఆయన బంగారు కుటుంబం, ఉపాధి హామీ పథకం పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇటీవల తక్కెళ్లపాడులో బంగారు కుటుంబంపై సర్వే చేశామని ఆ సర్వే ఆధారంగా గ్రామాల్లో నిరుపేదలను గుర్తించనున్నట్లు వివరించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాలలో 20 రకాల పండ్లు, గడ్డి పెంచేందుకు రైతులను ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. సమావేశంలో ఈవోపీఆర్డీ పద్మావతి, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం అధికారులు పాల్గొన్నారు.

రేపు స్వచ్ఛాంధ్ర ర్యాలీ

జగ్గయ్యపేట అర్బన్:జగ్గయ్యపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు గురువారం తెలిపారు. ఈ-వేస్ట్ డిస్పోజల్ చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ ఆఫీసు నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర ప్రారంభిస్తారని వివరించారు. కౌన్సిలర్లు, ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.

ఈడీ కేసులు ఎత్తివేయాలంటూ నిరసన

కంచికచర్ల : కాంగ్రెస్‌పార్టీ జాతీయ నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కేంద్ర ప్రభుత్వం అక్రమంగా పెట్టిన ఈడీ కేసులను ఎత్తి వేయాలని కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్ష్యుడు బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక స్టేట్‌బ్యాంక్ వద్ద నిరసన ప్రదర్శన చేశారు. కిరణ్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకుని నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్‌పార్టీ అగ్రనాయకులపై ఈడీ ద్వారా చార్జిషీట్ దాఖలు చేయటం రాజకీయ కుట్రలో భాగమని విమర్శించారు. నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి మందా వజ్రయ్య, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పోతురాజు, ఏసుదాస్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాటికలు

విజయవాడ కల్చరల్: పీఎంకేఎం ఆర్ట్స్, ఏపీ చలన చిత్ర వాణిజ్యమండలి సంయుక్త ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని కందుకూరి కల్యాణమండపంలో ప్రదర్శిచిన 44 వ జాతీయ సాంఘిక నాటికల పోటీలు గురువారం రెండవ రోజుకు చేరుకున్నాయి. తొలి ప్రదర్శనగా కేకేఎల్ స్వామి రచించి దర్శకత్వం వహించిన దేవరాగం నాటికలను, రెండవ ప్రదర్శనగా బ్రహ్మానందరావు, రచించి దర్శకత్వం వహించిన మనసాక్షి, మూడో నాటికగా, వల్లేటి కుశలశేఖర్ రచించి దర్శకత్వం వహించిన మోచేతి కంకణాలు నాటికలను ప్రదర్శించారు. నాటక రంగానికి చెందిన సూర్యదేవర జగన్నాథరావు, దామోదర గణపతిరావు, ఈవన రమేష్‌బాబును నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, పీఎంకేఎం ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు పసుపులేటి వెంకటరమణ, సోమిశెట్టి అమృత వర్షిణి, గుడివాడ లహరి, కొండిశెట్టి సురేష్ బాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉత్తమ ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవటం ద్వారా చక్కని సంపద సృష్టి చేయవచ్చని సెబీ మాజీ డెప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యకాంత్‌శర్మ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ మేనేజమెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో 'ఆర్థిక ప్రణాళిక ద్వారా సంపద సృష్టి' అంశంపై వెబినార్‌ను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన సూర్యకాంత్ శర్మ మాట్లాడుతూ సంపదసృష్టికి యువతకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. పెట్టుబడి ప్రాధాన్యతలను గుర్తించి ప్రణాళికను రూపొందించుకోవాలని చెప్పారు. మ్యూచువల్ ఫండ్స్ వంటి అనేక రంగాలను అందులో పరిమితులను వివరించి అటువంటి అంశాలపై యువత అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శరవణకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించిన నూతన అంశాలను తెలుసుకోవటానికి నిత్యం కృషి చేయాలన్నారు. విభాగాధిపతి డాక్టర్ ఎస్.మణికంఠ, అధ్యాపకులు డాక్టర్ వీ విజయదుర్గప్రసాద్, వై.సుధాచంద్ర పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ తెరిచి కార్మికులను ఆదుకోవాలి : తన్నీరు



సిమెంట్ ఫ్యాక్టరీ ఇంచార్జ్ శ్రీనివాస్‌రావుతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు

వేదాద్రి (జగ్గయ్యపేట): మండలంలోని వేదాద్రి గ్రామంలో ఉన్న వేదాద్రి సిమెంట్ కర్మగారంలో యాజమాన్యం తిరిగి సిమెంట్ ఉత్పత్తిని ప్రారంభించి, కార్మికులను ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు కోరారు. స్థానిక నాయకులు, కార్మికుల అభ్యర్థన మేరకు గురువారం ఆయన వేదాద్రి సిమెంట్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ ఏడాదిగా ఫ్యాక్టరీ మూతపడటంతో ప్రత్యక్షంగా పరోక్షంగా వందలాదిమంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. ఇక్కడ పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు యాజమాన్యం కొన్నినెలలపాటు వేతనాలు ఇచ్చినప్పటికీ రెండు నెలలుగా వేతనాలు ఇవ్వకపోతుండటంతో వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. చెన్నైకు చెందిన ఎస్సార్ గ్రూపు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఫ్యాక్టరీలో యాజమాన్యం తిరిగి ఉత్పత్తిని ప్రారంభించాలని కోరారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిమెంట్ డిస్పాచ్ తయారవ్వడానికి కోల్ టన్నుకు రూ.12000 అదనంగా పెంచడంతో పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అనంతరం తన్నీరు. ప్లాంట్ ఇన్‌చార్జి శ్రీనివాసరావును మాట్లాడగా ఈప్లాంట్ పాతకాలం నాటిది కావడంతోపాటు విద్యుత్ చార్జీలు.. జీఎస్టీ ధరలు పెరిగినందున ఉత్పత్తిని నిలిపివేశామని ఆయన బదులిచ్చారు. సిమెంట్ ధరలు తక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ఉత్పత్తి ప్రారంభిస్తే ఏడాదికి రూ.20కోట్లు నష్టం వస్తుందని వివరించారు. కొద్దిరోజుల్లోనే ప్లాంట్‌లో తిరిగి ఉత్పత్తి ప్రారంభించి గతంలో పనిచేసిన కార్మికులను విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి చల్లా వైకుంఠరావు, నియోజవర్గ బీసీ సెల్ విభాగ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు, గ్రామ పార్టీ కన్వీనర్ జవ్వాజీ నాగరాజు, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన



మా బడికి రండి ప్రచారం నిర్వహిస్తున్న ఎంఈవో చిట్టిబాబు, ఉపాధ్యాయులు

జగ్గయ్యపేట అర్బన్: నాణ్యమైన విద్య, ఇంగ్లిష్ మీడియంతోపాటు సకల సౌకర్యాలతో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని ఎంఈఓ ఎల్.చిట్టిబాబు సూచించారు. మా బడికి రండి కార్యక్రమంలో భాగంగా రాబోయే విద్యా సంవత్సరానికి సంబంధించి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు విలియంపేటలో గురువారం ఆయన పలువురు ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరించారు. నాణ్యమైన విద్యనందించడంతో పాటు ఉచితంగా పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆన్‌లైన్ పాఠాల కోసం టీవీల ఏర్పాటు, బాలికలకు ప్రత్యేక వాష్ రూమ్‌లు ఉన్నట్లు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విలియంపేటలో 20మంది విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగమణి, టీ.నరసింహారావు, సీఆర్పీలు రమేష్, దుర్గ, మధు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే వేడుకలు



ఫేర్ వెల్ వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న చందాపురం పాఠశాల విద్యార్థినులు



ధర్మవరప్పాడుతండ పాఠశాలలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

నందిగామరూరల్: మండలంలోని చందాపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాలకు హాజరై ప్రత్యేకాకర్షణగా నిలిచారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రాజేంద్రబాబు, నాగరాజు, విజయ్‌కుమార్, అహ్మద్ ప్యారా, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ధర్మవరప్పాదుతండలో..

ధర్మవరప్పాదుతండ(జగ్గయ్యపేట): గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మంగతాయమ్మ మాట్లాడుతూ వేసవిసెలవులను విద్యార్థులు వృధా చేయకుండా సృజనాత్మకతను పెంపొందిచే శిక్షణ తరగతులపై ఆసక్తి చూపాలని సూచించారు. సర్పంచ్ మణి, పేరంట్స్ కమిటీ చైర్మన్ రోజా, ఉపాధ్యాయులు లక్ష్మణరావు, సుజాత, వసంత పాల్గొన్నారు.

450 మందికి వైద్యపరీక్షలు

నందిగామటౌన్: కార్మికులకు ఈఎస్ఐ అనేక ప్రయోజనాలను అందిస్తోందని మున్సిపల్ కమిషనర్ రమణబాబు అన్నారు. స్థానిక బాబుజగ్జీవన్‌రాం భవన్‌లో మున్సిపల్ కార్మికులకు గురువారం ఈఎస్ఐ ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఎస్ఐతో కలిగే ప్రయోజనాలపై కార్మికులంతా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ శిబిరంలో 450 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట ఇన్‌చార్జి వైద్యాధికారి విజయదుర్గ, షాలిన, ఈఎస్ఐ వైద్యులు శరత్‌కుమార్, ఈఎస్ఐ హాస్పిటల్ విజయవాడ అభివృద్ధి కమిటీ సభ్యుడు పూజారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



